సాక్షి
యాదాద్రి భువనగిరి

బుధవారం : 30 : ఏప్రిల్ : 2025



మళ్లీ తెరపైకి 'రాచకొండ'
రాచకొండ ప్రాంతంలో రెండు రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.
- IIలో



కుటుంబ సభ్యులుగా భావించాలి
ఆర్టీసీ ప్రయాణికులను సిబ్బంది తమ కుటుంబ సభ్యులుగా భావించాలని నల్లగొండ రీజియన్ మేనేజర్ జానిరెడ్డి అన్నారు.
- IIలో

గరిష్ఠం/కనిష్ఠం
40° /25°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది.
ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పంచాయతీ కార్మికుల విధుల్లో సడలింపు

భువనగిరిటౌన్ : ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వం పంచాయతీ కార్మికులైన పారిశుద్ధ్య సిబ్బంది, మల్టీపర్పస్ వర్కర్ల విధుల్లో సడలింపు ఇచ్చింది. ఉదయం ఆరు గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీలో పనులు పూర్తి కాకపోతే సాయంత్రం సమయంలో చేయించుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చింది.

యాదగిరి క్షేత్రంలో విశేష పూజలు



ఆలయంలో శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం విశేష పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యం సమర్పించారు. ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా నిర్వహించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం వెండి జోడు సేవ పూజలు జరిపించారు.

ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన

భువనగిరి: డిప్యూటీ ఆర్ఎంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సుచరిత మంగళవారం భువనగిరి బస్టాండ్‌ను పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లో ఉన్న దుకాణాల్లో తినుబండారాలు, కూల్‌డ్రింక్స్‌ను ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని డీఎంను ఆదేశించారు. ఆమె వెంట యాదగిరిగుట్ట డీఎం వెంకటయ్య, కంట్రోలర్ సోమరాజు, టీఐ శ్రీనివాస్, మణికంఠ ఉన్నారు.

వచ్చే నెలలో చిన్న తరహా ఖనిజాల బ్లాక్‌ల వేలం

భువనగిరిటౌన్ : వచ్చే నెలలో చిన్న తరహా ఖనిజాల బ్లాక్‌ల వేలం పాట నిర్వహిస్తున్నట్లు గనుల, భూగర్భ శాఖ సహాయ సంచాలకుడు గోవిందరాజు తెలిపారు. వేలానికి సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లో గనులు, భూగర్భ శాఖ హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏమైన సందేహాలు ఉంటే 98666 33414 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు మహాత్మా బసవేశ్వర జయంతి ఉత్సవాలు

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో బుధవారం మహాత్మా బసవేశ్వర జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు బీసీ అభివృద్ధి అధికారి యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 10:00 గంటలకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హనుమంతరావు పాల్గొంటారని తెలిపారు.

ఎక్స్‌ప్లోజివ్స్‌లో తరచూ పేలుళ్లు



మోటకొండూర్ మండలం కాటేపల్లి గ్రామంలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలోని 18-ఏ బ్లాక్ రియాక్టర్ పేలడంతో చెల్లాచెదురైన దృశ్యం



ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమ ఎదుట రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

- కనీస రక్షణ చర్యలు చేపట్టని కంపెనీల యాజమాన్యాలు
- తనిఖీలు చేపట్టని అధికారులు
- గాల్లో కలుస్తున్న కార్మికుల ప్రాణాలు
- తాజాగా మోటకొండూర్ మండలం కాటేపల్లి గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో పేలుడు
- ముగ్గురు కార్మికులు మృతి, ఆరుగురికి తీవ్ర గాయాలు

యాదగిరిగుట్ట: ఎక్స్‌ప్లోజివ్ కంపెనీల్లో కార్మికులకు భద్రత లేకుండా పోతోంది. పరిశ్రమల యాజమాన్యాలు కార్మికులకు కనీస రక్షణ చర్యలు తీసుకోలేకపోతున్నారు. పరిశ్రమల్లో తనిఖీలు చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. వెరసి భారీ ప్రమాదాలు సంభవించి కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. మంగళవారం మోటకొండూర్ మండలంలోని కాటేపల్లి గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో సంభవించిన భారీ పేలుడు ఘటనలో ముగ్గురు మరణించగా.. మరో ఆరుగురు గాయపడ్డారు.

ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే తనిఖీ..

యాదాద్రి భువనగిరి జిల్లా పెద్దకందుకూర్, బొమ్మలరామారం, టంగుటూరు, మొటకొండూర్ మండలం కాటేపల్లిలో పేలుడు పదార్థాల (ఎక్స్ ప్లోజివ్స్) కంపెనీలు ఉన్నాయి. ఆయా ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమల్లో తయారు చేసిన డిటోనేటర్లు, ఫ్యూజ్ వైర్లు, డీఆర్డీఏ, శ్రీహరికోటతో పాటు ఆర్మీ, నావికాదళం వంటి సంస్థలతో పాటు ఇక్కడి నుంచి పేలుడు పదార్థాలను వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తుంటారు. దీంతో ఆయా కంపెనీల్లో కార్మికులు అనుక్షణం అప్రమత్తంగా పని చేస్తుంటారు. కంపెనీల యాజమాన్యాలు సైతం వారికి పూర్తి భద్రత కల్పించే విధంగా రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వీటిని ఎప్పటికప్పుడు స్థానిక పోలీసులతో పాటు, జిల్లా అధికారులు, కంట్రోలర్ ఆఫ్ ఎక్స్‌ప్లోజివ్స్ అధికారులు తనిఖీలు చేపట్టాలి. అయితే ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే తనిఖీ చేయడానికి వస్తున్న అధికారులు.. పటిష్ట చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలను ఆదేశించడంలో అంతగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రమాదాలు సంభవించినప్పుడు కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసి, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి..

ఇప్పటివరకు జరిగిన ప్రమాదాలు ఇలా..

- 2012లో పెద్దకందుకూర్‌లోని ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో సీ- 6 బ్లాక్ లో మొదటిసారిగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆలేరు ప్రాంతానికి చెందిన ఎల్లయ్య, వంగపల్లి ప్రాంతానికి చెందిన మొయినుద్దీన్ అనే ఇద్దరు కార్మికులు మృతి చెందారు.
- 2019లో జరిగిన మరో పేలుడు ఘటనలో పెద్దకందుకూరు గ్రామానికి చెందిన జయపాల్ అనే కార్మికుడు మృతి చెందాడు.
- 2020లో పరిశ్రమలోని ప్యూరింగ్ బిల్డింగ్ లో పేలుడు ప్రమాదం సంభవించగా, అందులో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. కాగా.. రెండు సార్లు పీఆర్డీసీ బ్లాక్ లోనే ప్రమాదాలు కావడం గమనార్హం.
- ఈ ఏడాది జనవరి 4న పెద్దకందుకూర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో జరిగిన పేలుడులో ఒక కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో కార్మికుడు తీవ్ర గాయాలతో బయట పడగా.. మరో ముగ్గురు కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి.

హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లింగస్వామి



శ్రీకాంత్‌ను హైదరాబాద్‌కు తీసుకెళ్తున్న దృశ్యం

భువనగిరిటౌన్ : మోటకొండూర్ మండలం కాటేపల్లి గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో జరిగిన పేలుళ్లలో గాయపడిన కార్మికులను మొదటగా భువనగిరికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స పొందుతున్న ముగ్గురిని, జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరిని వేర్వేరు అంబులెన్సుల్లో హైదరాబాద్‌కు తరలించారు. క్షతగాత్రుల్లో రాజబోయిన శ్రీకాంత్ (చాడ), బుగ్గ లింగస్వామి (పులిగిల్ల), నరేష్ (ఆత్మకూర్), బర్ల శ్రీకాంత్ (ఆలేరు), నల్ల మహేష్ (అనాజపురం)తో పాటు మరో కార్మికుడు ఉన్నాడు. భువనగిరిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో మహేందర్ అనే వ్యక్తి చికిత్స పొందుతున్నాడు.

ఆత్మకూరు(ఎం)లో విషాదఛాయలు



నరేష్ (ఫైల్)

ఆత్మకూరు(ఎం): ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్‌లో జరిగిన పేలుళ్లలో ఆత్మకూర్ మండల కేంద్రానికి చెందిన కల్వాల నరేష్(32) మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మండల కేంద్రానికి చెందిన కల్వాల అంజయ్య- లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలతో పాటు కుమారుడు నరేష్ ఉన్నాడు. ఇతడికి వలిగొండ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన యువతితో మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. నరేష్ గత రెండు సంవత్సరాలుగా ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం పగలు డ్యూటీ కావడంతో ఉదయమే వెళ్లాడు. పేలుళ్లతో తీవ్రంగా గాయపడి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

వివాహమై ఆరు నెలలు ..



సందీప్(ఫైల్)

మోటకొండూర్: ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో జరిగిన పేలుళ్లలో కాటేపల్లి గ్రామానికి చెందిన గునుగుంట్ల సందీప్(30) మృతిచెందాడు. ఇతడి వివాహం గత నవంబర్‌లో జరగగా.. ఆరు నెలలు కాకుండానే మృత్యుఒడిలోకి చేరుకున్నాడు. అతడి భార్య మూడు నెలల గర్భిణి. కాటేపల్లి గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ ప్రారంభం నుంచి సందీప్ అక్కడే పనిచేస్తున్నాడు. ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోధనలు మిన్నంటాయి. కాగా.. సందీప్ తండ్రి శ్రీనివాస్ గత మూడు సంవత్సరాల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. భర్తను, కుమారుడిని కోల్పోయిన మంగమ్మ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.

ఒక్క కొడుకూ.. మృతిచెందడంతో..



దేవి చరణ్ (ఫైల్)

మోటకొండూర్ మండల కేంద్రానికి చెందిన బుజ్జమ్మ కుమారుడు దేవిచరణ్. కొంత కాలం క్రితమే భర్తను కోల్పోవడంతో కుట్టుమిషన్ కుడుతూ కుమారుడిని ఇంటర్ వరకూ చదివించింది. అనంతరం దేవిచరణ్ కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో చేరాడు. కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్న సమయంలో కుమారుడు మృతిచెందడంతో తల్లి బుజ్జమ్మ రోదనకు అంతులేకుండా పోయింది.

మట్టి పాత్రలు మేలు



మట్టి పాత్రలు కొనుగోలు చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

భువనగిరి పట్టణంలోని కుమ్మరివాడ మీదుగా వెళ్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మట్టి పాత్రలను చూసి అక్కడ కొద్దిసేపు ఆగారు. అక్కడే వంట పాత్రలను కొనుగోలు చేశారు. మట్టి పాత్రల్లో ఏ వంట చేసినా అద్భుతంగా ఉంటుందని పేర్కొన్నారు.
- భువనగిరిటౌన్

బస్సు సర్వీస్ ప్రారంభం



బస్సు సర్వీస్ ప్రారంభించిన అనంతరం అందులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

రామన్నపేట నుంచి కక్కిరేణి మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు సర్వీస్‌ను ఎమ్మెల్యే వేముల వీరేశం మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రయాణికులతో కలిసి బస్సులో కొద్దిదూరం ప్రయాణించారు.
- రామన్నపేట

పార్టీ కేడర్‌ను పట్టించుకోవడం లేదు



ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, చిత్రంలో ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్

- కాంగ్రెస్ జిల్లా సమీక్షా సమావేశంలో పార్టీ ముఖ్య కార్యకర్తల ఆవేదన

సాక్షి,యాదాద్రి: కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పార్టీ కేడర్‌ను పట్టించుకోవడంలేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం భువనగిరిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, అండెం సంజీవరెడ్డి, నీలం పద్మ, ప్రమోద్ కుమార్, తంగెళ్లపల్లి రవికుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీలో కొద్దిమందికే ప్రాధాన్యత లభిస్తుందని, అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ కోసం శ్రమించిన వారిని పార్టీలో కనబడకుండా చేస్తున్నారని పార్టీ పరిశీలకులకు ఫిర్యాదు చేశారు. పార్టీ కార్యక్రమాలకు కనీసం సమాచారం ఇవ్వడంలేదని ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. అయితే గ్రామ, మండల, బ్లాక్, డీసీసీ అధ్యక్ష పదవులను కొత్త వారితో భర్తీ చేస్తామని జిల్లా ఇన్‌చార్జ్‌లు ధనవంతి, డాక్టర్ అనిల్‌కుమార్ ప్రకటించారు. ఎవరెవరు పోటీలో ఉంటారో ముందుకు రావాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కాంగ్రెస్ పార్టీకి బలమైన కార్యకర్తలకు అండగా ఉంటామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని తెలిపారు.

రైతుల సంక్షేమాభివృద్ధికే భూభారతి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విప్ ఐలయ్య, ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు

తుర్కపల్లి: రైతుల సంక్షేమాభివృద్ధి కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల పరిధిలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి భూభారతి చట్టం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. భూవివాదాల సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గంధమల్ల ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రికార్డుల్లో తప్పుల సవరణకు, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ మ్యూటేషన్, పట్టాదారు పాస్ పుస్తకాలు, పెండింగ్ సాదాబైనామా దరఖాస్తుల సమస్యలు భూభారతి ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. కొత్త చట్టం పై రైతులకు అవగాహన కల్పించేందుకు పది రోజులగా సదస్సులు ఏర్పాటు చేసి రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్నట్లు తెలిపారు. భూసమస్యలు పరిష్కరించడమే కాకుండా వారికి భూదార్ కార్డు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, తహసీల్దార్ దేశ్యానాయక్, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మి బాయి, ఏసీపీ రమేష్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కల్పన, దనావత్ శంకర్ నాయక్, చాడ భాస్కర్ రెడ్డి, రాజయ్య పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం తుర్కపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులకు ఎంపీ కిరణ్ కుమార్‌తో కలసి శంకుస్థాపన చేశారు. అనంతరం పల్లెపహాడ్ స్టేజీ నుంచి బాబునాయక్‌తండా మీదుగా పల్లెబాయితండా వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.

కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

- కలెక్టర్ హనుమంత రావు



ఎదుల్లగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు మజ్జిగ సరఫరా చేస్తున్న కలెక్టర్

వలిగొండ : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎండ తీవ్రతతో రైతులు ఇబ్బందులు పడకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ హనుమంత రావు సూచించారు. మంగళవారం వలిగొండ మండలంలోని ఎదుళ్లగూడెంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులకు తాగు నీరు, టెంట్ సౌకర్యం కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం తొందరగా తూకాలు చేసి వెంటనే ఎగుమతులు చేయాలని అన్నారు. ఆదర్శ రైతు వెంకటేష్ సహకారంతో అందజేసిన మజ్జిగను కలెక్టర్ రైతులకు పంపిణీ చేశారు.

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

రామన్నపేట: ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది రానీయొద్దని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. మంగళవారం రామన్నపేట మండలంలోని బోగారం పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ధాన్యం రాశులు, తేమను శాతాన్ని పరిశీలించారు. కొనుగోళ్లు, ఎగుమతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎండదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయనవెంట వ్యవసాయ విస్తరణాధికారి కీర్తన ఉన్నారు.

మరో ఉద్యమానికి సిద్ధం కావాలి

- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ



యాదగిరిగుట్ట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్, సీపీఐ నాయకులు

యాదగిరిగుట్ట : యువతను విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ పిలుపునిచ్చారు. మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ జిల్లా రెండవ మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యువ వికాసం పథకానికి 10లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని, వారందరికి వెంటనే డబ్బులు అకౌంట్లలో వేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర మాట్లాడుతూ.. ఉగ్రవాద దాడులు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో వ్యవసాయ దళిత ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ.. మతోన్మాదానికి, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యువత నడుం బిగించవలసిన అవసరం ఉందన్నారు. అంతకు ముందు యాదగిరిగుట్ట పట్టణంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, కొండూరు వెంకటేష్, మొగుళ్ల శేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మహాసభలో పలు నివేదికను జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు మహమ్మద్ నయీమ్, బద్దుల శ్రీనివాస్, సుద్దాల సాయికుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్, సీపీఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు చెక్క వెంకటేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు, మహాసభ ఆహ్వాన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రూ.50కోట్లు వాపస్

- బీఎన్ తిమ్మాపూర్ గ్రామస్తులకు పరిహారం కింద వచ్చిన డబ్బులు వెనక్కి
- పంపిణీలో ఆలస్యం, ఆర్థిక సంవత్సరం ముగియడంతో నిధులు వాపస్
- ఆర్అండ్ఆర్ లే అవుట్‌లో చేపట్టిన పనుల్లో జాప్యం
- ప్రారంభం కాని మురుగు కాల్వలు, సీసీ, బీటీ రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు



ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపూర్ గ్రామం

సాక్షి, యాదాద్రి: నృసింహసాగర్ (బస్వాపురం) రిజర్వాయర్ ముంపు గ్రామమైన బీఎస్ తిమ్మాపూర్ గ్రామస్తులకు పునరావాసం, పరిహారం అందడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు 16 ప్యాకేజీలో భాగంగా 11.39 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో చేపట్టిన రిజర్వాయర్‌లో భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్‌తోపాటు మరో రెండు తండాలు పూర్తిగా మునిగిపోతున్నాయి. బీఎన్ తిమ్మాపూర్‌కు పరిహారం కింద రూ.109 కోట్లు ఇవ్వాలి. గత డిసెంబర్‌లో ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసింది. ఇవి నిర్వాసితులకు సరిపోకపోవడంతో పూర్తి నిధులు వచ్చాక పంపిణీ చేద్దామని అధికారులు వేచిచూశారు. ఈలోపు ఆర్థిక సంవత్సరం ముగియడంతో వచ్చిన నిధులు వెనక్కి వెళ్లాయి.

నత్తనడకన లేఅవుట్ అభివృద్ధి పనులు

ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా భువనగిరి హుస్నాబాద్‌లో (బీఎన్ తిమ్మాపూర్) 28 ఎకరాల లేఅవుట్‌లో చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ.80 కోట్లు మంజూరు చేసినా పనులు కావడంలేదు. 1047 మందికి ప్లాట్లు పంపిణీ చేశారు. నూతన లేఅవుట్‌లో మౌలిక వసతుల కోసం తొలుత రూ.35 కోట్లు, రెండవ విడతలో రూ.45 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అంగన్‌వాడీ భవనాలు, పాఠశాల భవనాలు, పార్కులు, మంచినీటి సరఫరా, రోడ్లు నిర్మాణ పనులు ఆలస్యం అవుతున్నాయి. లేఅవుట్‌లో ట్యాంకులు నిర్మించి, అంతర్గత పైప్‌లైన్ వేసి, బోర్లు వేసి ఏడాదిన్నర కావస్తున్నా నీరివ్వలేకపోతున్నారు. మురుగు కాల్వల నిర్మాణం, పార్కులు, సీసీరోడ్లు, బీటీ రోడ్లు, ప్రభుత్వం భవనాల నిర్మాణం ప్రారంభం కాలేదు. బీఎస్ తిమ్మాపూర్ నిర్వాసితులకు ఇక్కడ ఒక్కో కుటుంబానికి 200 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.7.61 లక్షల నగదును ఇచ్చారు. కొందరు సొంత డబ్బులతో ఇళ్లు నిర్మించుకుంటున్నారు.

కోర్టుకు అఫిడవిట్ సమర్పించినా..

బీఎన్ తిమ్మాపూర్, జంగంపల్లి, బస్వాపూర్, వడపర్తి, లప్పానాయక్‌తండా, రుస్తాపూర్ భూనిర్వాసితులకు పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద బీఎన్ తిమ్మాపూర్, లప్పానాయక్ తండా, చోక్లాతండాల్లో ముంపు బాధితులకు మౌలిక సదుపాయాలకుగాను డబ్బులు ఇస్తామని కోర్టుకు హామీ ఇచ్చారు. మూడు విడతల్లో రూ.598.67 కోట్ల పరిహారం అందిస్తామని అప్పట్లో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు హైకోర్టుకు అఫిడవిట్ దాఖలు చేశారు. అయితే నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారంపై ఆలస్యం చేస్తుండడంతో హైకోర్టు రెండు సంవత్సరాల క్రితం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

నిర్వాసితులను ఆదుకోవాలి



ముంపు గ్రామమైన తిమ్మపురం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి. సుమారు రూ.400 కోట్లు ఇస్తే భూనిర్వాసితులు, ముంపు గ్రామ బాధితులకు పరిహారం అందుతుంది. సకాలంలో నిధులు పంపిణీ చేయకపోవడంతో వచ్చిన రూ.50కోట్ల నిధులు వాపస్ పోయాయి. మొత్తం పరిహారం ఇవ్వాలి.
- ఎడ్ల సత్తిరెడ్డి, బీఎస్ తిమ్మాపూర్

పరిహారం అందిస్తాం

బీఎస్ తిమ్మాపూర్ నిర్వాసితులకు పరిహారం కింద రూ.109 కోట్లు ఇవ్వాలి. గత ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసింది. పరిహారం పంపిణీ కోసం చర్యలు తీసుకుంటున్నాం. ఆర్అండ్ఆర్ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాం. త్వరలో మంచినీటి సమస్య తీరనుంది. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే పరిహారం పంపిణీ చేస్తాం.
- కృష్ణారెడ్డి, ఆర్డీఓ, భువనగిరి

క్లుప్తంగా

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

భువనగిరి: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన భువనగిరి రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. మంగళవారం రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 26న భువనగిరి రైల్వే స్టేషన్ సమీపంలో గోదావరి ఎక్స్‌ప్రెస్ కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడు దివ్యాంగుడని, వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. గులాబీ, తెలుపు రంగు షర్ట్, సిమెంట్ రంగు నెక్కర్ ధరించాడని, తెల్ల గడ్డం, తెల్ల జుట్టు కలిగి ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వివరాలు 98482 22169, 87125 68454 నంబర్లను సంప్రదించాలని భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు


గాయపడిన వెంకటేశంగౌడ్

వలిగొండ: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. వలిగొండ మండలం గొల్లెపల్లి గ్రామానికి చెందిన గోదల వెంకటేశంగౌడ్(51) మంగళవారం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా చెట్టు పైనుంచి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం గ్రామస్తులు రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

మళ్లీ తెరపైకి 'రాచకొండ' రిజర్వాయర్లు

- చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారంలో ఒకటి, నారాయణపురం మండలం రాచకొండ ప్రాంతంలో మరొకటి నిర్మించాలని యోచన
- శివన్నగూడెం ప్రాజెక్టు నుంచి లిఫ్టుల ద్వారా ఈ రిజర్వాయర్లు నింపాలని ప్రభుత్వం ప్రతిపాదన
- ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి
- పదేళ్ల క్రితమే రాచకొండలో 4 రిజర్వాయర్ల నిర్మాణానికి సర్వే చేసిన అప్పటి ప్రభుత్వం


రాచకొండ గుట్టల ప్రాంతం

సంస్థాన్ నారాయణపురం: రాచకొండ ప్రాంతంలో రిజర్వాయర్లు నిర్మించి శివన్నగూడెం ప్రాజెక్టు నుంచి లిఫ్టుల ద్వారా ఆ ప్రాజెక్టులను నింపుతామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సోమవారం సంస్థాన్ నారాయణపురంలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో ప్రకటించారు. యాద్రాద్రి భువనగిరి, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల సరిహద్దులో రాష్ట్ర రాజధానికి చేరువలో రాచకొండ ప్రాంతం విస్తరించి ఉంది. సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండ ప్రాంతంలో ఒకటి, చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారంలో మరొక రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధవుతున్నాయి. ఈ రిజర్వాయర్ల నిర్మాణంపై నల్లగొండలో జరిగిన ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి విన్నవించారు.

నీళ్లు ఉంటేనే రాచకొండ అభివృద్ధి..

హైదరాబాద్‌కు అతి చేరువులో యాద్రాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాల సరిహద్దులో సుమారు 35వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న ప్రాంతం రాచకొండ. ఇక్కడ పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములున్నాయి. ఈ ప్రాంతంలో కృషి విజ్ఞాన కేంద్రం, ఫిలింసిటీ, స్పోర్ట్స్ సిటీ, ఎడ్యుకేషన్ హబ్, స్మార్ట్ సిటీ, పవన విద్యుత్ ఉత్పత్తి లాంటివి ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని అనుకున్నారు. ఈ మేరకు రోడ్డు నిర్మాణాలు చేపట్టడానికి కూడా ప్రతిపాదనలు చేశారు. కానీ ఈ ప్రాంతంలో సరైన నీటి వసతి లేక ప్రతిపాదనలు మూలనపడ్డాయి.

రైతుల్లో చిగురిస్తున్న ఆశలు..

ఓ వైపు ఫ్లోరైడ్‌తో, మరోవైపు సాగుజలాలు లేక బీడు భూములుగా మారిన చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రోజురోజుకూ పెరిగిపోతున్న జనాభా, కరువు పరిస్థితులు భవిష్యత్ అవసరాలకు రిజర్వాయర్లు ఎంతో దోహదం చేస్తాయి. రాచకొండలో ప్రకృతి అందాలతో ఉన్నప్పటికి వేసవి కాలం వస్తే మోడు బారిన చెట్లు కనిపిస్తాయి. ఇక్కడ రిజర్వాయర్లు నిర్మిస్తే పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందాడానికి అవకాశం ఉంది. రాచకొండ అటవీ ప్రాంతంలోని మూగ జీవాల దాహార్తి కూడా తీరుతుంది. రిజర్వాయర్ల నిర్మాణంతో బీడు భూములు సస్యశ్యామలం అవుతాయని, భూగర్భజలాలు వృద్ధి చెందుతాయని రైతులు ఆశాభావంతో ఉన్నారు. ఈ ప్రాంత స్వరూపం, ఇక్కడి ప్రజల జీవనశైలి కూడా మారిపోనుంది.

రిజర్వాయర్ నిర్మించి నీళ్లు ఇవ్వాలి



గత కొన్నేళ్లుగా రాచకొండ ప్రాంతంలో రిజర్వాయర్లు నిర్మిస్తామని చెబుతున్నారు కానీ ఇంత వరకు ఎలాంటి నిర్మాణం చేపట్టడం లేదు. ఇక్కడ రిజర్వాయర్లు నిర్మించి ప్రతి ఎకరాకు నీళ్లు అందించి రైతుల కష్టాలు తీర్చాలి. వర్షాలు వస్తేనే పంట దిగుబడి లేకపోతే పంటలు ఎండి నష్టపోవడం మాకు పరిపాటిగా మారింది. ప్రభుత్వం ప్రకటనలకు పరిమితం కాకుండా రిజర్వాయర్ల నిర్మాణాన్ని ఆచరణలో సాధ్యం చేయాలి.

– నాగులపల్లి సత్తయ్య, రైతు, అరెగూడెం, సంస్థాన్ నారాయణపురం మండలం

10 సంవత్సరాల కిందటే సర్వే..

సాగు నీటి అవసరాలు, గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు పరిసర జిల్లాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు రాచకొండ ప్రాంతంలో 4 రిజర్వాయర్లు నిర్మించాలని పదేళ్ల క్రితమే అప్పటి ప్రభుత్వం ఆలోచన చేసింది. నీటిని నిల్వ చేసేలా రిజర్వాయర్లు నిర్మించాలని హైదారాబాద్ జలమండలి అధికారులు, నిపుణులు మూడుసార్లు రాచకొండ ప్రాంతంలో పర్యటించారు. 40టీఎంసీల నీటిని నిల్వ చేయడమే లక్ష్యంగా సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండలో 2, చౌటుప్పల్ మండలం డి.నాగారం చెరువు వెనుక భాగంలో ఒకటి, మల్కాపురం శివారులో మరొకటి రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రాథమికంగా 5వేల ఎకరాల భూమి అవసరమని అంచనాలు రూపొందించారు. రాచకొండ గుట్టల్లో నిర్మించ తలపెట్టిన రిజర్వాయర్ సమగ్ర నివేదికను రూపొందించే బాధ్యతలను వ్యాప్కోస్ సంస్థకు అప్పగించింది. నివేదక ఆధారంగా రూ.1,960కోట్ల అంచనా వ్యయంతో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. కానీ ఇది కార్యరూపం దాల్చలేదు. నివేదిక మూలనపడింది.

యాదగిరీశుడి హుండీ ఆదాయం రూ.2.41కోట్లు


హుండీ ఆదాయం లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించుకున్న కానుకలను మంగళవారం కొండ కింద గల శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం హాల్‌లో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, సిబ్బంది లెక్కించారు. ఈ లెక్కింపులో భాగంగా నగదు రూ.2,41,35,238, మిశ్రమ బంగారం 143 గ్రాములు, మిశ్రమ వెండి 2 కిలోల 250 గ్రాములు వచ్చిందని ఈఓ వెల్లడించారు. ఇందులో అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, నేపాల్, సౌదీ అరేబియా, సింగపూర్, మలేషియా, శ్రీలంక, థాయిలాండ్ తదితర దేశాలకు సంబంధించిన కరెన్సీని సైతం భక్తులు హుండీల్లో కానుకలుగా సమర్పించారని పేర్కొన్నారు. ఈ హుండీ ఆదాయం 34రోజులదని ఈఓ తెలిపారు.

బ్యాగేజ్ స్కానర్ ప్రారంభం


ధర్మ దర్శనం క్యూలైన్‌లో బ్యాగేజ్ స్కానర్‌ను ప్రారంభిస్తున్న పోలీసు అధికారులు

యాదగిరిగుట్ట ఆలయంలోని ధర్మ దర్శనం క్యూలైన్‌లో ఎక్స్‌రే బ్యాగేజ్ ఇన్‌స్పెక్షన్ స్కానర్‌ను ఎస్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, బీటీ టీం ఆర్ఎస్ఐ శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసిన నేపథ్యంలో యాదగిరిగుట్టలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ స్కానర్ ద్వారా భక్తుల బ్యాగులు, ఇతర వస్తువులను స్కాన్ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. మరో రెండు స్కానర్లను సైతం త్వరలోనే వీఐపీ ప్రొటోకాల్ కార్యాలయం వద్ద లిఫ్టులో, ఆలయ తూర్పు రాజగోపురం వద్ద ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

యాదగిరిగుట్ట ఆలయం అద్భుతం


సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌కు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడం గొప్ప విషయమని సినీ నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన తన స్నేహితులతో కలిసి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేసి లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. చాలా ఏళ్ల తర్వాత స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషానిచ్చిందన్నారు. ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన ప్రతిఒక్కరికి అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.

వరంగల్ భద్రకాళికి పోచంపల్లి పట్టువస్త్రాలు


భద్రకాళి అమ్మవారికి సమర్పించనున్న పట్టు చీరలు

భూదాన్‌పోచంపల్లి: వరంగల్‌లోని శ్రీభద్రకాళి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మే 2న నిర్వహించే కల్యాణోత్సవానికి పోచంపల్లికి చెందిన చేనేత కళాకారులు రుద్ర శ్రీశైలం, రుద్ర చెన్నకేశవులు, రుద్ర పాండురంగాశాస్త్రి కుటుంబ సభ్యులు మగ్గాలపై పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలను తయారు చేశారు. 15 రోజుల పాటు శ్రమించి అమ్మవారికి చిలుకపచ్చ, సాఫ్రాన్ రంగు కలిగిన రెండు ఇక్కత్ పట్టుచీరలతో పాటు స్వామివారికి పట్టు పంచెలను తయారుచేశారు. కల్యాణం రోజు ప్రదర్శనగా వెళ్లి పట్టువస్త్రాలతో పాటు తలంబ్రాలను ఈఓ కె. శేషుభారతికి అందజేయనున్నారు. ఈ సందర్భంగా చేనేత ఉత్పత్తిదారుల సంఘం మాజీ అధ్యక్షుడు రుద్ర శ్రీశైలం మాట్లాడుతూ.. తాము గత ఐదు సంవత్సరాలుగా భద్రకాళి అమ్మవారికి, భద్రేశ్వర స్వామికి పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన దేవస్థాన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రయాణికులను కుటుంబ సభ్యులుగా భావించాలి

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి
- డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, గ్యారేజీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేత


ఉత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, గ్యారేజీ ఉద్యోగులతో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి

యాదగిరిగుట్ట: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రతి ప్రయాణికుడిని సిబ్బంది తమ కుటుంబ సభ్యులుగా భావించి గమ్యస్థానాలకు చేర్చాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో మంగళవారం నల్లగొండ రీజియన్ త్రైమాసిక ప్రగతి చక్ర పురస్కారాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రీజియన్‌లోని 7 డిపోల్లో ఈ త్రైమాసికంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లతో పాటు గ్యారేజీ ఉద్యోగులకు నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. ప్రమాదాలు జరగకుండా ప్రతి డ్రైవర్ బస్సులు నడపాలన్నారు. కండక్టర్లు ప్రయాణికులతో మంచిగా ప్రవర్తించాలన్నారు. గ్యారేజీలో మెకానిక్‌లు బస్సులను మంచి కండీషన్‌లో ఉంచేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఆపరేషన్ సుచరిత, డిప్యూటీ రీజినయల్ మేనేజర్ మెకానికల్ ఎస్. భీమ్‌రెడ్డి, ఆయా డిపోల మేనేజర్లు మురళీకృష్ణ, శ్రీనాథ్, రామ్మోహన్‌రెడ్డి, ఎస్. లక్ష్మీనారాయణ, బి. శ్రీనివాస్, యాదగిరిగుట్ట డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎం. ప్రవీణ్, రీజినల్ ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ వెంకటమ్మ, అసిస్టెంట్ ఇంజనీర్ మెకానిక్ ఆర్. హనుమాన్ నాయక్, ఎల్. జయప్రకాష్ తదితరులున్నారు.

బైక్‌పై వెళ్తూ గేదెను ఢీకొని.. పోస్టల్ ఉద్యోగి దుర్మరణం

అనంతగిరి: బైక్‌పై వెళ్తున్న పోస్టల్ ఉద్యోగి గేదె అడ్డు రావడంతో దానిని ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన అనంతగిరి మండలం బొజ్జగూడెం తండా సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణానికి చెందిన డి. వీరబాబు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కట్టుకాసారం గ్రామంలో పోస్టల్ శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం నేలకొండపల్లిలో జరిగిన మీటింగ్‌కు వెళ్లి తిరిగి బైక్‌పై ఇంటికి వస్తుండగా.. అనంతగిరి మండల పరిధిలోని బొజ్జగూడెం తండా సమీపంలోకి రాగానే కోదాడ-ఖమ్మం జాతీయ రహదారిపై గేదె అడ్డు రావడంతో దీనిని ఢీకొని కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పవర్ ప్లాంట్ డీఈకి గాయాలు

నేరేడుచర్ల: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని గేదె ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి నేరేడుచర్ల మండల కేంద్రం సమీపంలో జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన ధరావత్ రమేష్ దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామ సమీపంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో డీఈగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి బైక్‌పై ఖమ్మం నుంచి దామరచర్ల మండలంలోని యదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు వెళ్తుండగా.. నేరేడుచర్ల మండల కేంద్రం సమీపంలోని రామగిరి వద్ద ఓ గేదె బైక్‌ను ఢీకొట్టడంతో రమేష్ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లకు కొత్త సంరక్షకులు

- 5వ జోన్‌లోని ఎస్సీ హాస్టళ్లకు 54 మంది, ఎస్టీ హాస్టళ్లకు 13 మందిని కేటాయించిన ప్రభుత్వం
- నేడు కౌన్సిలింగ్ ద్వారా పోస్టింగ్

నల్లగొండ: ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లకు కొత్త హాస్టల్ వెల్ఫేర్ అధికారులు రానున్నారు. ఏళ్ల తరబడి రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు రిటైర్ అవ్వడమే తప్ప భర్తీ ప్రక్రియ జరగలేదు. దీంతో నల్లగొండ జిల్లాలో ఒక్కో హాస్టల్ వెల్ఫేర్ అధికారికి 1 నుంచి 3 హాస్టళ్లకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ వెల్ఫేర్ అధికారుల నియామక ప్రక్రియను టీజీపీఎస్సీ ద్వారా పూర్తిచేసింది.

5వ జోన్‌కు 67 మంది కేటాయింపు..

5వ జోన్(యాదాద్రి జోన్)లో నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, జనగామ జిల్లాలు ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం ఈ జోన్‌లోని ఎస్సీ సంక్షేమ హాస్టళ్లకు 54 మందిని, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లకు 13 మందిని కొత్తగా హాస్టల్ వెల్ఫేర్ అధికారులను కేటాయించింది.

సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి..

హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు సంబంధించి మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యింది. నల్లగొండ కలెక్టరేట్‌లో వీరికి బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. ఈ కౌన్సిలింగ్‌లో పాల్గొని నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల్లో ఏ జిల్లాలో పోస్టింగ్ కావాలో కోరుకునేందుకు అవకాశం ఉంటుంది. కొత్తగా వస్తున్న హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో జిల్లాలో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ కానున్నాయి. దీంతో హాస్టళ్లలో వసతులు కూడా మెరుగుపడే అవకాశం ఉంది.

ఖబరస్థాన్‌లో బయటపడ్డ పురాతన శాసనాలు


వివరాలు వెల్లడిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడరూరల్: కోదాడలోని రామాలయం పక్కన గల ఖబరస్థాన్‌లో మంగళవారం ఓ వ్యక్తిని ఖననం చేసేందుకు ముస్లింలు గొయ్యి తవ్వుతుండగా పురాతన శాసనాలు బయటపడ్డాయి. వక్ఫ్‌బోర్డు సభ్యులు, పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని శాసనాలను స్వాధీనం చేసుకొని డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. అనంతరం ఆర్డీఓ సూర్యనారాయణ, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. తమిళంతో పాటు పలు భాషల్లో ఉన్న రాగి పలకలు బయటపడినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వాటిని పురావస్తు శాఖ కార్యాలయానికి పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తహసీల్దార్ వాజిద్ అలీ, పట్టణ సీఐ శివశంకర్, ఎస్ఐ రంజిత్‌రెడ్డి, ఆర్ఐ రాజేష్ ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తి దుర్మరణం


వేణుగోపాల్‌రెడ్డి (ఫైల్)

వేములపల్లి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై వేములపల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణం తాళ్లగడ్డకు చెందిన మందడి వేణుగోపాల్‌రెడ్డి(47) మంగళవారం ఉదయం బైక్‌పై నల్లగొండ సమీపంలోని మర్రిగూడలో ఉంటున్న తన బంధువు ఇంటికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి మిర్యాలగూడకు వస్తుండగా.. వేములపల్లి మండల కేంద్రంలోకి రాగానే స్థానిక జెడ్పీ హైస్కూల్ పక్క వీధి నుంచి ఒక్కసారిగా బ్లాక్ స్కార్పియో కారు వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వేణుగోపాల్‌రెడ్డికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య మందడి ప్రణీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మృతునికి ఒక కుమార్తె ఉంది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష, జరిమానా

సూర్యాపేటటౌన్: సూర్యాపేట పట్టణంలో సోమవారం రాత్రి నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఆరుగురు పట్టుబడినట్లు ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. వారిని మంగళవారం సూర్యాపేట కోర్టులో హాజరు పర్చగా.. ఓ వ్యక్తికి ఒక్కరోజు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా మరో ముగ్గురికి కలిపి రూ.4వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

పవర్ ప్లాంట్‌లో కొనసాగుతున్న మరమ్మతులు

మిర్యాలగూడ: దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్-1 బాయిలర్‌లో ఈ నెల 28న తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో విద్యుత్ కేబుల్ వైర్లు, పైపులు కాలిపోయాయి. మే నెలలో 1వ యూనిట్‌ను ప్రారంభించేందుకుగాను గత కొన్ని రోజులుగా అధికారులు 1వ యూనిట్‌లో ట్రయల్ రన్ చేస్తుండగా బాయిలర్ పొడవు సుమారు 90 మీటర్లు ఉండగా భూభాగాన వాల్వ్‌ల నుంచి ఇంధనం లీకేజ్ కావడంతో బాయిలర్ వేడికి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 20 మీటర్ల వరకు గల పరికరాలు, కేబుల్‌వైర్లు, వాల్వ్‌లు, ఐరన్ పైపులు కాలిపోయాయి. బీహెచ్‌ఈఎల్ సిబ్బంది మరమ్మతులు ముమ్మరంగా చేపడుతున్నారు. మరో మూడు రోజులపాటు పనులను చేపట్టి పూర్తిస్థాయిలో సిద్ధం చేయనున్నట్లు తెలుస్తోంది. పనులు పూర్తికాగానే ట్రయల్ రన్‌ను కొనసాగించనున్నట్లు సమాచారం. భారీ నష్టం జరిగినప్పటికీ సంబంధిత అధికారులు వివరాలు వెల్లడించడం లేదు. కాగా ఈ విషయమై పవర్ ప్లాంట్ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని గేదెలు మృతి

నేరేడుచర్ల: ట్రావెల్స్ బస్సు ఢీకొని మూడు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ ఘటన మంగళవారం నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం నుంచి తులసీ ట్రావెల్స్ బస్సు బెంగళూరుకు వెళ్తోంది. మార్గమధ్యలో నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామ సమీపంలోని వీవీఆర్ స్కూల్ వద్దకు రాగానే బస్సు నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని నర్సయ్యగూడెం వాసి మన్నెం వెంకన్నకు చెందిన మూడు పాడి గేదెలను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వడదెబ్బతో కూలీ మృతి


నరసయ్య (ఫైల్)

ఆత్మకూర్.ఎస్(సూర్యాపేట): ఎండల తీవ్రతతో వడదెబ్బ తగిలి సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండల పరిధిలోని గట్టికల్ గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీ తలారి నరసయ్య (59) మృతిచెందాడు. సోమవారం ఉపాధి హామీ పనికి వెళ్లిన నరసయ్య రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతడిని కుటుంబ సభ్యులు సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగానే రాత్రి మృతిచెందాడు.

సేంద్రియ ఎరువులే పంటకు బలం

- పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకల ఎరువుతో అధిక దిగుబడులు

పాడి-పంట

నడిగూడెం : మొక్కలు, జంతువుల అవశేషాల నుంచి తయారయ్యే సేంద్రియ ఎరువులను పంటలకు తక్కువ మంది రైతులు వినియోగిస్తుంటారు. అయితే సేంద్రియ ఎరువుల వినియోగంతో పంటలకు చాలా ఉపయోగం. చాలా వరకు పంటలకు పురుగులు, తెగుళ్లు తగ్గడంతోపాటు, పురుగు మందు ఖర్చు తగ్గుతుందని పలు పరిశోధనల్లోనూ, కొందరు రైతులు తమస్వీయ పర్యవేక్షణలో తెలుసుకున్నారు. అందుకే చాలా మంది రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. సేంద్రియ సాగుపై నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ సూచనలు.

పశువుల ఎరువు

పశువుల ఎరువు రైతులు అనాదిగా వినియోగిస్తున్న ఎరువే. అయితే రాను రాను వ్యవసాయంలో యాంత్రీకరణ రావడంతో పశు సంతతి తగ్గి పశువుల ఎరువు అందుబాటులో లేకుండా పోయింది. పంటలకు ఉపయోగించే ఎరువుల్లో ఇది చాలా ముఖ్యమైంది. ప్రాథమికంగా పశువుల ఎరువు ఏ పంట సాగులోనైనా వేసి తీరాల్సిందే. పంటలకు పోషకాలను అందించడంతో పాటు పొలంలో కురిసిన వాన నీటిని ఒడిసి పట్టి పంటలకు అందించడంలో పశువుల పేడ కీలక పాత్ర పోషిస్తుంది. మిగతా ఎరువులను పంటకు అందించాలన్నా ఈ ఎరువు తరువాత ఏదైనా పొలంలో ఒక వరుస మట్టి, ఆ తరువాత పశువుల ఎరువు మరో పొరమట్టి, పశువుల ఎరువు ఇంకో పొర ఆకులు, అలములు, పశువుల మేత వేయగా తొక్కి, పడేసిన చెత్త చెదారాలను తొలకరి వర్షాలు కురవగానే వెంటనే ఆ కుప్పలోని ఎరువు మట్టిని చిన్నచిన్న కుప్పలుగా పోసి పొలమంతా చల్లితే మంచి ఫలితం ఉంటుంది.


పొలంలో పోసిన పశువుల పెంట

కంపోస్టు ఎరువు

గ్రామాల్లో లభ్యమయ్యే చెత్త, రాలిన ఆకులు, ఇతర కలుపు మొక్కలు కుళ్లి కూరగాయలు, వేరుశనగ కాయల పొట్టును కలిపి పశువుల పేడ, మూత్రంతో కుప్పగా వేసి, కుళ్లింపజేస్తే కంపోస్టు ఎరువు తయారవుతుంది. ఇలా చేయడం వల్ల సేంద్రియ ఎరువు బాగా కుళ్లిపోతుంది. దీనిని కూరగాయల పంటలకు, ఇతర పంటలకు వేస్తే మొక్కలు ఏపుగా పెరగడంతో పాటు, చీడ పీడలు లేకుండా ఆశించిన దిగుబడి వస్తుంది.

ఉపయోగాలు ఇవే..

సేంద్రియ ఎరువుల వినియోగంతో నేలకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. సేంద్రియ పదార్థం భౌతిక లక్షణాలను మెరుగుపరుస్తుంది. బరువు నేలలు గుల్ల బారి వేర్లు చక్కగా పెరగడానికి సహాయపడుతుంది. నీరు కూడా ఇంకుతుంది. ఇసుక నేలల్లో మట్టి రేణువుల అమరికను క్రమబద్ధీకరిస్తుంది. నీటిని గ్రహించి తేమను ఎక్కువకాలం పట్టి ఉంచుకొని పంటను బెట్టకు గురికాకుండా చేస్తుంది. అలాగే నీటి ఎద్దడిని తట్టుకొనే శక్తి పెరుగుతుంది. నేలలోని పోషకాలను మొక్కలు గ్రహించేందుకు తోడ్పడే సూక్ష్మజీవులకు ఆహారంగా ఉపయోగపడుతుంది.

కోళ్ల ఎరువు

కోళ్ల ఫారాల్లో కోళ్ల కింద వేసిన పొట్టు, మల మూత్రాలతో సేంద్రియ ఎరువు తయారవుతుంది. దాదాపు 40 కోళ్ల నుంచి ఏడాదికి టన్ను ఎరువు వస్తుంది. ఈ కోళ్ల ఎరువులో 3 శాతం నత్రజని, 2 శాతం భాస్వరం, 2 శాతం పొటాష్ పోషకాలు ఉంటాయి. తేమ తగ్గేకొద్ది పోషక శాతం పెరుగుతుంది.